రాష్ట్రంలో సంక్షేమ పాలన

● ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


చిత్తూరు: జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. పెద్దిశెట్టిపల్లిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు చెప్పారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును, అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీ జయరాం, మండల కన్వీనర్ త్యాగరాజులు, సర్పంచులు మునిరత్నం, ధనమ్మ, నేతలు జయపాల్, వెంకటేష్, నందకుమార్, దేవేంద్ర, రామూర్తి, రాజు, జయరాజ్ పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: మండలంలోని 35 ఎర్రంపల్లె సచివాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లీశ్వరి, మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లత, నేతలు రాజేష్‌రెడ్డి, సుబ్రమణ్యం, సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: వావిల్‌తోటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళికృష్ణా, జెడ్పీటీసీ దేవిక, సర్పంచ్ మహేశ్వరి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గౌరి, సింగల్ విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: కేఎం కండ్రిగ గ్రామసచివాలయంలో మంగళవారం ' వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి సర్పంచ్ ప్రవల్లిక, సింగిల్ విండో డైరెక్టర్ అశోక్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఎత్తిరాజులు, దుర్గా, చిన్నా, నేతలు ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, గ్రామ కార్యదర్శులు చెంగల్‌రాయులు, కావ్య పాల్గొన్నారు.


తవణంపల్లెలో కిట్ల పంపిణీ

తవణంపల్లెలో..

తవణంపల్లె: తవణంపల్లె సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును వైఎస్సార్‌సీపీ నేతలు ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. తర్వాత మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సి.హరిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, నేతలు కిషోర్‌రెడ్డి, రమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, ఎంపీటీసీలు బాబు, డేవిడ్, జగన్నాథరెడ్డి, శివాజీరెడ్డి పాల్గొన్నారు.


బంగారుపాళెం: కరపత్రాల పంపిణీ


ఐరాలలో జెండా ఆవిష్కరణ


వావిల్‌తోటలో..

పకడ్బందీగా కులగణన


పూతలపట్టు: మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: కులగణన సర్వేను వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం బైటపల్లి సచివాలయంలో వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సమీక్ష నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కులగణనపై అవగాహన కల్పించాలన్నారు. సింగల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, సర్పంచ్ రామతులసి పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: కులగణన వివరాలు పక్కాగా సేకరించాలని ఎంఈఓ రామ్‌నాయక్ తెలిపారు. మంగళవారం పేయనపల్లె, పాపిశెట్టిపల్లె, చీలాపల్లె పంచాయతీల కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 గణపతి పాల్గొన్నారు.


గుడిపాల: మాట్లాడుతున్న రామ్‌నాయక్

అభివృద్ధి ప్రణాళిక తయారుచేయాలి


బంగారుపాళెంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

–డీఈఓ విజయేంద్రరావు

బంగారుపాళెం: ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలను తయారుచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు సూచించారు. బంగారుపాళెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పాఠశాల అభివృద్ధి ప్రణాళికపై ఉపాధ్యాయుల నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, బడిపిల్లలకు అవసరమైన వసతులను ఆవాస ప్రాంతాల కమిటీలతో చర్చించి ప్రణాళికను తయారుచేయాలని ఆదేశించారు. పాఠ్యాంశాలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. వర్క్‌బుక్స్ కరెక్షన్ చేయడంలో నిర్ణీత సమయాన్ని పాటించాలన్నారు. అంతకుముందు రాగిమానుపెంట ఉన్నత పాఠశాల, బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఎంఈఓ నాగేశ్వర్‌రావు, ఎంఈఓ-2 రమేష్ బాబు పాల్గొన్నారు.

వర్షాలతో మొక్కల పెంపకం

చిత్తూరు కార్పొరేషన్: తూర్పు అటవీశాఖ రేంజ్ పరిధిలో పలు మొక్కలు పెంచుతున్నట్లు ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. పూతలపట్టు బీట్ అటవీ పరిధిలో 11, 200 ఎర్రచందనం మొక్కలు నాటామన్నారు. అదేవిధంగా పాచిగుంట బీట్ పరిధిలో జామ, నేరేడు, నారేపి, ఎర్రచందనం కలిపి మొత్తం 8 వేల మొక్కలు నాటామని చెప్పారు. వర్షాలు పడుతుండడంతో మొక్కల పెంపకం చేపట్టామని పేర్కొన్నారు.

ప్రజల చెంతకే వైద్యసేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత


మత్యంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. నాంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మత్యంలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మత్యంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా ఉత్తర బ్రాహ్మణపల్లెలో వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్ వేలు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, రెడ్డెమ్మ, శ్రీహరి, సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాలకార్మికుల గుర్తింపునకు తనిఖీలు

చిత్తూరు కార్పొరేషన్: బాలకార్మికుల గుర్తింపునకు తనిఖీలు నిర్వహించనున్నట్లు కార్మికశాఖ ఏసీఎల్ ఓంకార్‌రావు మంగళవారం తెలిపారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ డిసెంబర్ 8వ తేదీన తనిఖీలు చేపట్టి నివేదిక పంపుతారని వెల్లడించారు.

బంగారుపాళెం దళితవాడకు శ్మశానం

బంగారుపాళెం: స్థానిక దళితవాడకు శ్మశానం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గుంతూరు చెరువు సమీపంలో స్థలం కేటాయించి మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. దళితవాడకు శ్మశానం లేదని గ్రామస్తులు చెప్పడంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నవజాత శిశువులను జాగ్రత్తగా చూసుకోవాలి

యాదమరి: చంటి పిల్లల తల్లులు నవజాత శిశువులను జాగ్రత్తగా చూసుకోవాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. మంగళవారం కీనాటంపల్లెలో వారు నవజాత శిశువును పరిశీలించారు. అనంతరం వారు చంటి పిల్లల తల్లులతో మాట్లాడుతూ పుట్టిన 28 రోజులు అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. సీహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చేయూత మహిళా మార్ట్ తనిఖీ

తవణంపల్లె: తవణంపల్లెలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను మంగళంవారం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆయన మార్ట్‌లో పనిచేస్తున్న సిబ్బందితో మార్ట్‌ను ఎలా నడుపుతున్నారు, సరుకులు నిల్వ, రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ కొనుగోలు, విక్రయాలు, లాభ నష్టాలపై ఆరా తీశారు. సమగ్రంగా వివరాలు పంపాలని సిబ్బందికి సూచించారు. రాష్ట్రంలో తవణంపల్లె చేయూత మహిళా మార్ట్ పనితీరు బాగుందని కితాబిచ్చారు. మార్ట్‌లో నాణ్యమైన సరకులు సరసమైన ధరలకు సభ్యులకు అందించాలని సూచించారు. డీపీఎం రవికుమార్, ఏపీఎంలు రవి, దేవసేన, సీసీలు, సిబ్బంది, మార్ట్ లీడర్లు పాల్గొన్నారు.


కొనుగోలు, విక్రయాలపై ఆరా తీస్తున్న శ్రీనివాస్

ఓటర్ల నమోదుకు అవగాహన

చిత్తూరు కలెక్టరేట్: క్షేత్రస్థాయిలో యువ ఓటర్ల నమోదుకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆర్డీఓ చిన్నయ్య అన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ అరుణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

అంగన్‌వాడీ టీచర్ మృతి

బంగారుపాళెం: అనారోగ్యం కారణంగా ఆత్మహత్యకు యత్నించిన అంగన్‌వాడీ టీచర్ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. రాగిమానుపెంటకు చెందిన లోకనాథం భార్య సుకన్య(38) అంగన్‌వాడీ టీచర్. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం రాత్రి ఆరోగ్యం మరింత ఇబ్బంది పెట్టడంతో మనస్తాపానికి గురై ఎలుకల మందు తాగింది. కుటుంబీకులు సీఎంసీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ సాగు సందర్శన

బంగారుపాళెం: మండలంలోని కల్లూరుపల్లెలో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న రైతుల పొలాలను మంగళవారం తమిళనాడుకు చెందిన రైతుల బృందం సందర్శించింది. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు పంటల సాగును వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకుంది. జేఏస్ సీఈఓ రామరావు, రాష్ట్ర శాఖ సిబ్బంది చంద్రశేఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఆరుగురికి జరిమానా

చిత్తూరు అర్బన్: నగరంలోని మురకంబట్టుకు చెందిన దంపతులపై దాడికి పాల్పడిన ఆరుగురు నిందితులకు రూ.60 వేల జరిమానా విధిస్తూ చిత్తూరు అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. రామ్మూర్తి, వడిమాంబ దంపతులకు స్థానికంగా ఉన్న హరి కుటుంబానికి చిన్నపాటి మనస్పర్థలు ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 24వ తేదీన రామ్మూర్తి దంపతులపై అదే కాలనీకి చెందిన డి.హరి (22), బి.దాము (40), బి.రాము (36), డి.విశాలాక్షి (38), బి.విజయలక్ష్మి (35), ఆర్.మీనా (29) కుటుంబసభ్యులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువుకావడంతో ఒక్కొక్కరు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.60 వేలు చెల్లించాలని, అందులో రూ.30 వేలను బాధితులకు పరిహారంగా చెల్లించాలని న్యాయమూర్తి వెన్నెల తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల రోజులు జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన

పూతలపట్టు: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలపై అవగాహన ఉండాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పీడీలు, పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు డిసెంబర్ 15 నుంచి గ్రామస్థాయిలో నిర్వహించాలని సూచించారు. ముందుగా పంచాయతీ కార్యదర్శులు గ్రామీణ స్థాయిలో ప్రతిభను చూపే వారి వివరాలను పీడీలకు తెలియజేయాలని సూచించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ముందుగా పంచాయతీ కార్యదర్శి వద్ద పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీలకు పూతలపట్టు విద్యార్థి


బాలాజీని అభినందిస్తున్న టీచర్లు

పూతలపట్టు: 67వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పి.బాలాజీ జాతీయస్థాయికి ఎంపికైనట్లు పీడీలు కృష్ణ, ఢిల్లీరాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 20 వరకు గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట స్థాయి పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను మంగళవారం డీవైఈఓ చంద్రశేఖర్ అభినందించారు. జనవరి మూడవ వారంలో చత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు బాలాజీ ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విశ్వనాథరెడ్డి, టీచర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

యాదమరి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మంగళవారం ఉదయం స్థానిక ఉన్నత పాఠశాలలో వారం రోజులుగా గ్రంథాలయ వారోత్సవాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను పాఠశాల హెచ్ఎం గిరిరాజా ప్రదానం చేశారు. గ్రంథాలయ అధికారి మధు, డ్రాయింగ్ మాస్టర్ దామోదర ఆచారి పాల్గొన్నారు.

చెడు అలవాట్లు వద్దు

తవణంపల్లె: విద్యార్థులు చెడు అలవాట్లు అలవర్చుకోవద్దని ఎంఎల్‌హెచ్‌పీ పావని, హెచ్‌ఎం మధు, ఆశా కార్యకర్త సౌందర్య పేర్కొన్నారు. మండలంలోని జి. వడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం చెడు అలవాట్ల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఐదు రోజుల క్రితం పాఠశాలలో విద్యార్థులు పెద్దభూపాలం కాయలు తిని అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంఘటన విదితమే. దీంతో వైద్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

బకాయి జీతాలు చెల్లించాలి


డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. మంగళవారం జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి డీపీఓ లక్ష్మికి వినతపత్రం అందజేశారు. కార్మికుల వేతనాల బిల్లులను అప్‌లోడ్ చేశామని డీపీఓ చెప్పారు. నేతలు నాగరాజన్, గోవిందస్వామి, లత, గజేంద్రబాబు, వెంకటేష్, కృష్ణయ్య, మురళి, ఏసు, భవ్య, మాధవి పాల్గొన్నారు.

ఓటర్ల క్లెయిమ్‌ల పరిశీలన

తవణంపల్లె: తహసీల్దార్ కార్యాలయంలో కొత్తగా వచ్చిన ఓటర్ల నమోదు, సవరణలు, తొలగింపుల కోసం వచ్చిన క్లెయిమ్‌లను తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, డీటీ నరేష్‌కుమార్, భూ రీసర్వే డీటీ వెంకటరమణ సిబ్బందితో పరిశీలించారు. క్లెయిమ్‌లను బీఎల్ఓల ద్వారా సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. తర్వాత డౌన్‌లోడ్ చేసి పరిశీలిస్తున్నారు. జనవరి 5వ తేదీలోపు ఓటర్ల తుది జాబితాను ప్రదర్శించాలని మూడు రోజులుగా అధికారులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు.

గర్భిణులకు సేవలపై అవగాహన

చిత్తూరు రూరల్: గర్భిణులకు అందిస్తున్న సేవలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హైరిస్క్ కేసులపై పర్యవేక్షణ ఉండాలన్నారు. సకాలంలో వైద్య సేవలు అందించి సుఖ ప్రసవం చేయించాలని సూచించారు.